# భాగవతం

# కుచేలుడు



: వ్యాఖ్యాత :


"అభినవ వ్యాస", "జ్ఞానప్రపూర్ణ"

**శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc[Ag]**

వ్యవస్థాపకులు

ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం : చిలకలూరిపేట.

Website : WWW.SRICHALAPATHIRAO.COM

Email : care@srichalapathirao.com

Contact : +91 80085 39770 / +91 98862 65225


పూజ్య గురుదేవులు
జ్ఞానప్రపూర్ణ
శ్రీ దేవిశెట్టి చలపతిరావు గారు B.Sc., (Ag)
వ్యవస్థాపకులు : ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట
Contact : (Mobile) 80085 39770 / (Land Line) 08647 254716
Email : care@srichalapathirao.com
Visit www.srichalapathirao.com to listen Pravachanas

# గురుదేవుల పరిచయము

శ్రీ దేవిశెట్టి చలపతిరావుగారు 1946 సెప్టెంబర్ 12వ తేదీన గుంటూరు జిల్లా తుర్లపాడుగ్రామంలో జన్మించారు. తండ్రి వీరరాఘవయ్య, తల్లి పుల్లమ్మ. వీరి నివాసం చిలకలూరిపేట. ప్రాథమికవిద్య తుర్లపాడు గ్రామంలోను, ఉన్నత విద్య చిలకలూరిపేటలోను అభ్యసించి, బాపట్ల వ్యవసాయకళాశాల నుండి B.Sc. (Ag.) ప్రధమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

పూవు పుట్టగానే పరిమళిస్తుందనే నానుడి ప్రకారం 4 సంవత్సరాల వయస్సు నుండి 8 సంవత్సరాల వయస్సు వరకు వీరి నోటి నుండి ఏ వాక్కు వస్తే అలాగే జరిగేది. పూర్వజన్మసంస్కారం వల్ల వీరు 12 సంవత్సరాల వయస్సు నుండే రామాయణ, భారత, భాగవత గ్రంధాలను, పురాణాలు - ప్రబంధాలను అధ్యయనం చేయటం ప్రారంభించారు. ప్రత్యేకంగా మహాభారతంపై విశేషమైన ఆసక్తి కలిగి, 20 సంవత్సరాలకుపైగా ఆంధ్రమహాభారతం, సంస్కృతమహాభారత గ్రంధాలపై తీవ్ర పరిశోధనలు గావించి, చిలకలూరిపేటలో 1988 నుండి 1992 వరకు ధారావాహిక ప్రవచనములు చేసి, శ్రోతల ప్రశ్నలకు అప్పటికప్పుడే జవాబులిస్తూ వారికి సందేహనివృత్తి గావించారు.

1990 నుండి చిలకలూరిపేట చిన్మయమిషన్ కార్యదర్శిగా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను, హోమాలను, పూజలను, గీతాజ్ఞానయజ్ఞాలను, సత్సంగాన్ని నిర్వహించారు. 1994 లో 'ఆధ్యాత్మిక జ్ఞాన పీఠాన్ని' స్థాపించి, ప్రసన్న బండ్లమాంబ శ్రీ రాజమాతాదేవి వారిచే ప్రారంభింపజేశారు. అప్పటి



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225

నుండి ప్రతిరోజూ సత్సంగము, ప్రతినెల గీతాపారాయణలతోబాటు శ్రీకృష్ణ జన్మాష్టమి, గీతాజయంతి, శంకరాచార్యజయంతి, రమణమహర్షిజయంతి, ఆషాఢ - కార్తీక - మాఘ - వైశాఖ పౌర్ణమిల యందు ఆధ్యాత్మిక సదస్సులు, జన్మదినోత్సవం, విజ్ఞానయాత్రలు, వనసమారాధనలు, ధ్యానతరగతులు, వార్షికోత్సవం మొదలగు అనేక కార్యక్రమాలను జరుపుకొనుటలోను, నిరంతర జప, ధ్యాన, ఆత్మవిచారణ, సాక్షీభావన, బ్రహ్మనిష్ఠ మౌ||న సాధనలతో, పూర్తి ఆధ్యాత్మిక జీవితాలను గడుపుటలోను, మాకు సదా మార్గదర్శకులుగా ఉండి మా వెన్నుతట్టి, చేయిపట్టి ముందుకు నడిపిస్తున్న కర్మయోగులు, జ్ఞాన ప్రపూర్ణులు మా గురుదేవులు.

భగవంతుడు నిర్దేశించినబాటలో పయనిస్తూ, తనలో నిక్షిప్తమైయున్న ఆధ్యాత్మికజ్ఞానాన్ని పదిమందికీ పంచాలనే సంకల్పంతో 1996 నుండి వివిధ పట్టణాలలో ఆధ్యాత్మిక జ్ఞానయజ్ఞముల ద్వారా భగవద్గీత, ప్రకరణ గ్రంథాలైన శంకరాచార్యులవారి భజగోవిందం, తత్వబోధ, ఆత్మబోధ, వివేకచూడామణి, అద్వైతసారం, శ్రీ దక్షిణామూర్తిస్తోత్రం, అపరోక్షానుభూతి, శ్రీ సదాశివబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆత్మవిద్యావిలాసం, శంభునటనం, భగవాన్ శ్రీ రమణమహర్షుల వారి ఉపదేశసారం, నారదభక్తిసూత్రములు, బ్రహ్మసూత్రములు, ఇంకా రామాయణ, భారత, భాగవతములు, అలాగే ఈశ, కేన, కఠ, ముండక, మాండూక్య, కైవల్య, తైత్తిరీయ, సూర్య, మొదలగు 108 ఉపనిషత్తులపైనను ప్రవచనములు చేస్తూ జ్ఞానసుగంధాలను నలువైపుల ప్రసరింపజేస్తున్నారు. ఇప్పటివరకు చిలకలూరిపేట, విజయవాడ ధర్మల్

పవర్ స్టేషన్, రాయలసీమ ధర్మల్ పవర్ ప్రాజెక్ట్, వినుకొండ, శ్రీశైలం, కాశీ, తిరువణ్ణామలై, నెల్లూరు, బాపట్ల మొదలగుచోట్ల 180 'ఆధ్యాత్మిక జ్ఞానయజ్ఞము'లను చేశారు. 1998 లో వి.టి.పి.యస్. ఎ.కాలనీ యందు 108 హోమకుండాలతో వాసుదేవ మహాయజ్ఞాన్ని నిర్వహించారు.

1993లో భగవద్గీత ప్రవచనముల ముగింపు సందర్భంగాను, 2001లో వివేకచూడామణి ప్రవచనముల ముగింపు సందర్భంగా చిలకలూరిపేటలోను; 1999లో భగవద్గీత ప్రవచనముల ముగింపుసందర్భంగాను, 2002లో వివేకచూడామణి ప్రవచనముల ముగింపుసందర్భంగా వి.టి.పి.యస్.లోను శిష్యులందరూ గురుదేవులను ఘనంగా సన్మానించారు. 2006లో 100 జ్ఞానయజ్ఞాలు పూర్తిగావించిన సందర్భంగా శిష్యులందరూ కలసి 'జ్ఞానప్రపూర్ణ' బిరుదుతోను, 2011లో మహాభారత పరిశోధనలో గురుదేవుల కృషికి 'అభినవ వ్యాస' బిరుదుతోను గురుదేవులను సత్కరించటం జరిగింది.

1994లో సామాన్యులకు కూడా వేదాంత విషయాలు సులభంగా అర్థమయ్యేరీతిలో గురుదేవులు 'కర్మసిద్ధాంతం' అనే చిన్న గ్రంథాన్ని రచించి ప్రచురింపజేశారు. తిరిగి 2002, 2008, 2009లోను పునర్ముద్రణ జరిగింది. 1998లో శుక్లయజుర్వేదమునందలి 'ఈశావాస్యోపనిషత్తు' పై అందరికి అర్థమయ్యే విధంగా సరళమైన, వాడుకభాషలో విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింపజేశారు. 1999లో శంకరాచార్యులవారి 'భజగోవిందం' పై అందరికీ అతి సులభంగా అర్థమయ్యే విధంగా, ఎంతో వివరంగా, వ్యాఖ్యను వ్రాసి ప్రచురింపజేశారు. తిరిగి 2009లో ద్వితీయ ముద్రణ జరిగింది.

'భగవద్గీత' అనగానే "అమ్మో! అది మనలాంటి సామాన్యులకు కాదు" అనుకొనేవారు "భగవద్గీతను ఇంత తేలికగా అర్థం చేసుకోగలమా?" అనుకొనేటట్లు ప్రవచనములు చేస్తున్న గురుదేవులు 2011లో 1, 2 అధ్యాయములను ప్రచురింపచేశారు. 2012లో భగవాన్ రమణమహర్షుల "ఉపదేశసారము"నకు, సామవేదం నుండి గ్రహించబడిన 'కేనోపనిషత్తు'కు విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింపచేశారు. ఇవిగాక 'శ్రీ నారదభక్తిసూత్రాలు', శంకరాచార్యులవారి 'శ్రీ దక్షిణామూర్తిస్తోత్రం', 'ఆత్మబోధ' పై ఎంతో వివరణాత్మకంగా, సోదాహరణంగా, విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింపచేశారు. 2013 లో శ్రీ సదాశివబ్రహ్మేంద్రసరస్వతి స్వామివారి 'ఆత్మవిద్యావిలాసం', భగవద్గీత 3, 4, 5 అధ్యాయములను ప్రచురింపచేశారు. 2015లో భగవద్గీత 6 నుండి 17 అధ్యాయములు ప్రచురింపచేశారు. ప్రస్తుతం ముండకోపనిషత్తు, కఠోపనిషత్తు, మాండూక్యోపనిషత్తు , భగవద్గీత 18 అధ్యాయములు ప్రచురణకు సిద్ధం చేయబడుతున్నాయి.

ఇవిగాక విజయవాడ నుండి వెలువడే ***ధ్యానమాలిక*** మాసపత్రికలో 2008 నుండి భగవద్గీతను, 2009 నుండి మహాభారతమును ధారావాహికంగా ప్రచురిస్తున్నారు. ఇక దేశవిదేశాలలోనున్న తెలుగువారు ఈ జ్ఞానాన్ని గ్రహించటానికి వీలుగా www.srichalapathirao.com పేరుతో ఒక వెబ్సైట్ ను ప్రారంభించటం జరిగింది. దీని ద్వారా *ఆధ్యాత్మిక జ్ఞానపీఠం* కార్యక్రమాలను, గురుదేవుల ప్రవచనాలను, గురుదేవుల వివిధ రచనలను,

భజనలు, కీర్తనలను వినవచ్చును, చదువవచ్చును, డౌన్లోడ్ చేసుకొనవచ్చును. ఇక వివిధ గ్రంధాలపై గురుదేవుల ప్రవచనములను CD.ల రూపంలోను, వీడియో DVD ల ద్వారా, PEN Drive, External Hard Disk ద్వారా అందిస్తున్నారు.

ముందుముందు మోక్షమార్గంలో పయనించే ఎందరికో మార్గ నిర్దేశనం చేయగల ఎన్నో గ్రంధాలు ముముక్షుజనావళిని తరింపజేయుటకు అందుబాటులోనికి రావాలని, అందుకు త్యాగధనులైన భక్తులు, సాధకులు, మోక్షార్ధులు ముందుకు రాగలరని భగవంతుని మనసారా ప్రార్ధిస్తున్నాను.

జ్ఞాన సూర్యునిలా ప్రకాశిస్తూ, నిస్వార్ధంగా తన సేవలను అందిస్తున్న కర్మయోగి, సనాతనమైన వైదికధర్మాన్ని ప్రచారంచేస్తూ, మాకు మార్గదర్శకులైన భగవంతుని ముద్దుబిడ్డ మా గురుదేవులను పరిచయం చేసే భాగ్యం నాకు కలిగించినందులకు భగవంతునికి శతసహస్రవందనములు సమర్పించుకుంటున్నాను.

- శ్రీమతి రావూరి అన్నపూర్ణ

కార్య నిర్వాహక అధ్యక్షులు

ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం, చిలకలూరిపేట.



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225

## : కుచేలుడు :

పరీక్షిన్మహారాజు శుకబ్రహ్మకు నమస్కరించి మహాత్మా! పరమ భక్తాగ్రేసరుడైన కుచేలుని శ్రీకృష్ణపరమాత్మ ఎలా కనికరించి రక్షించాడో తెలియజేయమని ప్రార్థించాడు.

అప్పుడు శుకబ్రహ్మ మహాభక్తుడు, జితేంద్రియుడు, ప్రశాంతవదనుడు, బ్రహ్మవిదుడు, కుటిలము తెలియనివాడు పరమభాగవతోత్తముడు ఐన కుచేలుని గాధను ఇలా తెలియజేస్తున్నాడు.

కుచేలుడు శ్రీకృష్ణుని చిన్ననాటి స్నేహితుడు. అతడి అసలు పేరు సుదాముడు. కుచేలుడు అంటే చినిగిన వస్త్రాన్ని ధరించినవాడు - అని. ఈ దేహమే వస్త్రం - అయినప్పుడు చినిగిన వస్త్రాన్ని ధరించని వాడెవడున్నాడీ లోకంలో? - ఎంత బాగా పోషించి రక్షించినా ఏదో ఒక నాటికి జీర్ణమై నశించిపోయేదే ఈ దేహం.

కుచేలుడు నిరుపేద. ఆకలి బాధను అనుభవిస్తున్నా పరమాత్మ ధ్యానంలో రమిస్తూ ఉంటాడు. అప్రయత్నంగా లభించిన దానితో జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. ఉంఛ వృత్తిలో ఉండి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడి భార్య కూడా భర్తకు తగిన ఇల్లాలే. ఆకలి చేత ఆమె దేహం కూడా కృశించిపోయింది.

తన ఆకలిని తీర్చలేకపోయినా, కట్టుకొనేందుకు తగిన వస్త్రాన్ని కొనివ్వలేకపోయినా, భర్తపై ఏమాత్రం అగౌరవం లేదు. ఉన్న దానితోనే

సంసారాన్ని ఈడ్చుకొస్తూ ఉన్నది. అయితే కొన్ని రోజుల నుండి కనీసం పిల్లల కడుపు నింపటానికి కూడా ఏమీ లభించటం లేదు.

తన ఆకలిని గూర్చి పట్టించుకోవటం లేదు. కాని ఎముకలు బయటకు వచ్చి ఆకలితో లోపలికి పోయిన భర్త కడుపు చూస్తే కడుపు తరుక్కుపోతున్నది. తినటానికి ఇంటిలో ఏమీలేదు. అమ్మటానికి ఒంటిపై గాని, ఇంటిలో గాని ఏమీలేవు. ఏం చేయాలో పాలుపోవటం లేదు. 'అమ్మా! ఆకలి' అని అల్లాడిపోతున్న బిడ్డలకడుపు ఎలా నింపాలో తెలియటం లేదు. పిల్లలు తల్లిని చుట్టుముట్టి ఏడుస్తున్నారు.

ఆ స్థితిలో భర్తను సమీపించి, మహాత్మా! భగవానుడైన శ్రీకృష్ణుడు మీ చిన్ననాటి స్నేహితుడు గదా! ఆయన సాధుప్రియుడు, బ్రాహ్మణులకు మేలు చేసేవాడు. ఒక్కసారి ఆయన వద్దకు వెళ్ళితే దయ చూపించక పోడు గదా! అన్నది. ఆమె మాటలకు కుచేలుడు, "ఏమిటీ? భగవాను డైన నా కృష్ణుని దగ్గరకెళ్ళి సంపదలను కోరమంటావా? ఆయనను ధ్యానించటమేగాని యాచించటం నాకు తెలియదు - అన్నాడు.

భర్త మాటలు విని భార్య, "నేను మిమ్ములను యాచించమని చెప్పటం లేదు. ఆ పరమాత్మ మీ చిన్ననాటి స్నేహితుడు గదా! ఇంతవరకు ఆయనను ఒక్కసారి కూడా మీరు దర్శించలేదు. మన ఈ కష్టాలకు అది కూడా ఒక కారణమేమో - ఒక్కసారి ఆ మహాత్ముని దర్శించండి. బిడ్డలకు కనీసం ఒక్కపూటైనా కడుపు నింపాలని ఆరాటపడుతున్నాను. నాయీ బాధను తెలియజేసి మిమ్ములను ఇంకా

బాధపెట్టాల్సి వస్తున్నది. ద్వారకానాథుడు ఆశ్రిత జనవత్సలుడు, మీ చిన్ననాటి మిత్రుడు, మిత్రులంటే ఆయనకు ఎంతో ప్రేమ అని మీరే నాతో అనేకసార్లు చెప్పారు. మనలను ఆదుకొనే మహాత్ముడు ఆయనొక్కడే. సంశయించకుండా వెళ్ళిరండి. భగవద్దర్శన ఫలం మన బ్రతుకులకు చుక్కానిలా ఉపయోగపడుతుంది. మీరు ఆ మహాత్ముని దర్శిస్తే చాలు మన కష్టాలు తీరిపోతాయని నా మనస్సు చెబుతున్నది - అని అనేక విధాలుగా నచ్చజెప్పింది. "చిన్ననాటి స్నేహితుడైన ఆ భగవానుని దర్శనానికి ఒట్టి చేతులతో ఎలా వెళ్ళేది?" అనే సందేహం కలిగింది కుచేలునికి.

ఇంటిలో ఏమీలేవు. అయినా సరే ఎప్పుడూ ఎవరినీ చేయి చాచి అడగని ఆ ఇల్లాలు చుట్టుప్రక్కల భక్తుల ఇళ్ళకు వెళ్ళి నాలుగు పిడికెళ్ళు అటుకులు అడిగి తెచ్చింది. వాటిని ఒక వస్త్రఖండంలో మూటకట్టి భర్తకు అందించింది. చినిగిన పంచె కట్టుకొని, కఱ్ఱను చేతబట్టుకొని, భుజాన అటుకుల మూటను వ్రేలాడదీసుకొని భగవన్నామస్మరణ చేసుకుంటూ ద్వారక వైపు నడక సాగించారు కుచేలుడు. ఆహారం తీసుకొని చాలా రోజులుకావటాన నీరసంగా నడుస్తున్నాడు. నాలుగు మైళ్ళు అలాగే నడిచాడు. అలా నడుస్తూ తన మనస్సులో ఇలా అనుకుంటున్నాడు.

సీ. ద్వారకా నగరంబు నేరీతి జొత్తును
భాసురాంతః పుర వాసియైన
యప్పుండరీకాక్షు నఖిలేశునెబ్బంగి



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225

దర్శింపగలనో తద్ద్వార పాలు

రెక్కడి విప్రుడ విందేలు వచ్చెద

వనియడ్డ పెట్టిరే నపుడు వారి

కేమైన బరిదాన మిచ్చి చొచ్చెదమన్న

ఊహింప అర్థ శూన్యుండ నేను

తే. ఐన నాభాగ్య మతని దయార్ద్ర దృష్టి

గాక తలపోయగా నొండు గలదె యాత

డేల నన్ను నుపేక్షించు నేటి మాట

లనుచు నా ద్వారకాపుర మతడు సొచ్చి.

అలా ద్వారకానగరంలో ప్రవేశించి, దారిలో కనిపించిన వారిని "అయ్యా! ద్వారకానగరం ఇంకా ఎంత దూరంలో ఉన్నది అని అడిగాడు. దానికి వారు ఆశ్చర్యం చెంది; అయ్యా! ఇదే ద్వారకానగరం అన్నారు.

దానితో కుచేలుడు శ్రీకృష్ణుడు ఉండే రాజభవనం ఎటో తెలుసుకొని ఆ వైపుగా నడక సాగించాడు. ఇంతలో ఒక బ్రాహ్మణుడెదురు పడి, "అయ్యా! దేనికోసమో అన్వేషిస్తున్నారు? మీకు ఎవరు కావాలి? ఎక్కడకు వెళ్ళాలి? అని అడిగాడు. కుచేలుడు ఆ బ్రాహ్మణునికి నమస్కరిస్తూ మహాత్మా! యదుకుల శ్రేష్ఠుడు, ఇందీవరశ్యాముడు, కౌస్తుభాలంకారుడు, అఖిలలోకారాధ్యుడు,



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225

చక్రధారి, పన్నగశయనుడు అయిన శ్రీకృష్ణభగవానుని దర్శనార్థం వచ్చాను అన్నాడు కుచేలుడు.

ఆ మాటలకు ఆశ్చర్యపోయిన ఆ బ్రాహ్మణుడు ద్వారకాధిపతి శ్రీకృష్ణుడెక్కడ? ఈ బక్క బ్రాహ్మణుడెక్కడ? ఆయన దర్శనం కోసం వచ్చాడా? అనుకుంటూ వెళ్ళిపోయాడు. మరి కొంతదూరం వెళ్ళిన తర్వాత మరొకరిని అడిగాడు కుచేలుడు. "అయ్యా! శ్రీకృష్ణ మందిరానికి దారి ఎటు?" అని. "శ్రీకృష్ణుని మందిరంతో నీకేం పని?" అన్నాడా వ్యక్తి. "ఆయన నా చిన్ననాటి స్నేహితుడు. ఆయనను దర్శించేందుకు వచ్చాను". అన్నాడు కుచేలుడు. "ఏమిటీ! నీవు శ్రీకృష్ణునికి మిత్రుడవా?" అంటూ పరిహాసంగా చూచాడు ఆ వ్యక్తి. ఈ పేద బ్రాహ్మణునికి మతి చలించిందేమో! లేకపోతే సకల సంపదలతో తులతూగే శ్రీకృష్ణుడెక్కడ? ఈ పేద బాపడెక్కడ? అనుకుంటున్నారు - ద్వారకాపురవాసులు.

కుచేలుడు ఎదురు వచ్చిన వారిని అడుగుతూ అడుగుతూ శ్రీకృష్ణుని మందిరం వద్దకు వచ్చాడు. ద్వారం వద్ద ఇరువైపులా నిలిచిన ద్వారపాలకులు లోనికి వెళ్ళటానికి వీలులేదని నిలిపివేశారు. "అయ్యా! నా పేరు కుచేలుడు. నేను శ్రీకృష్ణుని మిత్రుడను." - అన్నాడు కుచేలుడు. అతడి మాటలను ద్వారపాలకులు నమ్మలేదు. ఈ పేద బ్రాహ్మణుడు

యాచన కోసం వచ్చి ఇలా మాట్లాడుతున్నాడు అని భావించి లోపలకెళ్ళటానికి వీలు లేదన్నారు. దానికి కుచేలుడు "నాయనలారా! నేను యాచించుటకు రాలేదు. నేను నిజంగానే శ్రీకృష్ణునికి బాల్యమిత్రుడను. ఇద్దరం సహాధ్యాయులం. నాకు నా బాల్యమిత్రుని దర్శనమే కావలసింది. నేను ఇక్కడే ఉంటాను. మీరు లోనికి వెళ్ళి "కుచేలుడు మీ దర్శనానికి వచ్చాడు" అని తెలియజేయండి. ఆ తరువాత నాభాగ్యం ఎలా ఉన్నదో అలాగే జరుగుతుంది అన్నాడు.

ద్వారపాలకుడు మెత్తబడ్డాడు. లోనికి వెళ్ళి శ్రీకృష్ణుని సమీపించి "ప్రభూ! తమ దర్శనార్థం ఒక పేద బ్రాహ్మణుడు వచ్చియున్నాడు. అతడు బిచ్చగానిలా, చినిగిన మురికి వస్త్రాలతో ఉన్నాడు. నడుము వంగిపోయి ఉన్నది. అతడి పేరు "కుచేలుడట" అన్నాడు. 'కుచేలుడు' అనే మాట చెవిని పడటంతోనే శ్రీకృష్ణుడు ఆసనంపై నుండి ఒక్కసారిగా క్రిందకు ఉరికి, కుచేలా - కుచేలా! అంటూ బయటకు పరుగు తీస్తున్నాడు. శ్రీకృష్ణుని ఈ వింతప్రవర్తన భార్యలకు ఆశ్చర్యంగాను, అగమ్య గోచరంగాను ఉన్నది. "అసలు వచ్చినదెవరు? శ్రీకృష్ణుని దర్శించటానికి ప్రతిరోజూ ఎందరో వస్తుంటారు. కాని ఎప్పుడూ ఇలాంటి ఉత్సాహాన్ని పరవశాన్ని నాథునిలో చూడలేదు" అనుకుంటూ ఆ వచ్చిన వానికోసం ఎదురుచూస్తూ నిలబడ్డారు. బయట వాకిలి వద్ద కుచేలుడు నిలబడి ఉన్నాడు. కాళ్ళకు చెప్పులు లేవు, తలపై గొడుగు లేదు, శరీరంపై మంచి వస్త్రం లేదు, ఎముకలు ముందుకు, నేత్రాలు లోపలకు పోయి



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225

ఉన్నవి. ఏ ఆడంబరము లేదు. చేతిలో కర్ర సాయంతో నిలబడి ఉన్నాడు. దీనంగా ఉన్నాడు. అట్టి మిత్రుడైన కుచేలుణ్ణి చూచి శ్రీకృష్ణుడు - "మిత్రమా! కుచేలా! వచ్చావా! నన్ను సంతోషపెట్టటానికి వచ్చావా! నన్ను ఉద్ధరించటానికి వచ్చావా!" అంటూ కళ్ళ వెంట ఆనందభాష్పాలు రాలుతూఉండగా శ్రీకృష్ణుడు కుచేలుని గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు. ద్వారపాలకులతో సహా అక్కడున్న వారంతా ఆశ్చర్యచకితులౌతున్నారు.

శ్రీకృష్ణునికి ప్రపంచం కనిపించటం లేదు. ఆయన ఆనందానికి మేరలేదు. చేయి పట్టుకొని కుచేలుని లోపలకు నడిపించాడు. మిత్రమా! కుచేలా! నిన్ను చూడటానికి నేనే రావాలని ఎన్నోసార్లు ప్రయత్నించాను. కానీ ఆలస్యం జరిగిపోయింది. ఈ రోజు నీవే నాకోసం వచ్చావు. నాకెంతో ఆనందంగా ఉన్నది అని ఆనందభాష్పాలు రాల్చాడు శ్రీకృష్ణుడు. ఇదంతా చూస్తున్నారు అష్టభార్యలు. రుక్మిణీదేవి జలాన్ని తీసుకొని వచ్చింది. శ్రీకృష్ణుడు కుచేలుని పాదాలను ఆ నీటితో కడిగి ఆ జలాన్ని తన శిరస్సున చల్లుకున్నాడు. పాదరక్షలు లేకుండా నడిచి వచ్చినందున కాలిలో గ్రుచ్చుకొన్న ముల్లును శ్రీకృష్ణుడు తీసి వేశాడు. జరిగిన దానిని స్వప్నంలా - ఇంద్రజాలంలా భావిస్తున్నాడు కుచేలుడు. నిశ్చేష్టుడయ్యాడు. నోటమాట రావటం లేదు. కృష్ణయ్యా! నీవు ద్వారకాధీశుడవు. నేను నిరుపేద బ్రాహ్మణుడను. నా పూర్వజన్మ పుణ్యవశాన నీవు నా సహాధ్యాయుడివయ్యావు. నీవు నా పాదాలను



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225

పట్టుకొని ముల్లు తీయటం ఉచితంగా లేదు అన్నాడు కుచేలుడు. దానికి కృష్ణయ్య, "కుచేలా! ఎంత మాట? నేను ద్వారకాధిపతినని పలికి నీ హృదయంలో ఉన్న నా స్థానాన్ని తొలగిస్తావా? ఎంత ధనం, సంపదలు చేరినా కుచేలా! నేను ఎప్పటికీ నీ స్నేహితుణ్ణే - అని తెలుసుకో - అన్నాడు. శ్రీకృష్ణుని అమృతమయ పలుకులు కుచేలుని హృదయాన్ని కదిలించి వేస్తున్నాయి. ఇద్దరి నేత్రాలు ఆనందంతో అశ్రుపూర్ణాలయ్యాయి. మళ్ళీ మళ్ళీ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటున్నారు. శ్రీకృష్ణుడు కుచేలుని వెంటబెట్టుకొని రుక్మిణీదేవి మందిరంలో ప్రవేశించాడు. తన తల్పంపై తన ప్రక్కనే కుచేలుని కూర్చుండ బెట్టుకున్నాడు. రుక్మిణీదేవి చామరంతో కుచేలునికి వీస్తూ సేవ చేస్తున్నది. బిచ్చగానిలా, చినిగినబట్టతో ఉన్న ఒక పేద బ్రాహ్మణునికి రుక్మిణీ శ్రీకృష్ణులు సేవ చెయ్యటాన్ని చూచిన అంతఃపుర స్త్రీలు ఆశ్చర్యపోతున్నారు - ఆహా! ఈతడెంత అదృష్టవంతుడో గదా!

ఉ. ఏమి తపంబు చేసెనొకొ యీ ధరణీ దివిజోత్తముండు తొల్
బాముున యోగి విస్ఫుర దుపాస్యకుడై తనరారు నీ జగత్
స్వామి రమాధి నాథు నిజతల్పమునన్ వసియించి యున్నవా
డీ మహనీయమూర్తి కెనయే ముని పుంగవులెంత వారలున్

అని ఆశ్చర్యపోతున్నారు. ఇద్దరూ ఒకరినొకరు చేతులు పట్టుకొని కూర్చున్నారు. శ్రీకృష్ణుడు కుచేలునితో, మిత్రమా! గురుకులం నుండి

వెళ్ళిన తర్వాత నీవు తగిన భార్యను పొందావా? గృహస్థుడవైనప్పటికీ నీవు ప్రసన్నంగా ఉన్నావు. అలంకారాలపై నీకు ప్రీతి లేనట్లుగా ఉంది. నన్ను గుర్తు చేసుకుంటున్నావా? మనం గురుకులంలో ఉన్ననాటి సంఘటనలు గుర్తు వస్తున్నాయా? గురుపత్ని మనపై చూపిన ఆదరాభిమానాలు వాత్సల్యం జ్ఞాపకం వస్తున్నదా?

మిత్రమా! ఒకనాడు గురుపత్ని కట్టెలు తేవటానికి మనను అరణ్యంలోకి పంపించింది. ఆ రోజు గొప్ప గాలివాన వచ్చింది. సూర్యాస్తమయం కావటంతో దిక్కులు చీకటిమయమయ్యాయి. ఒకవైపు గాలివాన, మరొకవైపు కటిక చీకటి, మార్గం కనిపించక ఆ రాత్రి అంతా అరణ్యంలోనే గడిపాం, అది నీకు గుర్తున్నదా? అన్నాడు శ్రీకృష్ణుడు. ఆ సంఘటన గుర్తు చేయటంతో కుచేలుడు సిగ్గుతో కుంచించుకపోయాడు. దానికొక కారణం ఉంది. ఆ రోజు గాలివానలో ఒక చెట్టు క్రింది కృష్ణ కుచేలులిద్దరు గడిపారు. ఆ సమయంలో కుచేలుని వద్ద సెనగలున్నాయి. కృష్ణునికి తెలియకుండా కుచేలుడు వాటిని తింటున్నాడు. అది గమనించి కృష్ణుడు కుచేలా! ఏమిటి తింటున్నావు? అన్నాడు. కుచేలుడు ముందు వెనుక ఆలోచించకుండా అబ్బే! ఏమీ తినటం లేదు. చలి బాగా ఉండటం వల్ల పళ్ళు కొరుక్కుంటున్నాను - అన్నాడు. నిజం చెబితే అందులో కొన్ని శనగలు కృష్ణునికి ఇవ్వాల్సి వస్తుందని కుచేలుని భయం. భగవంతునికి పెట్టకుండా తింటే దరిద్రుడవుతాడు అనే దానికి ఇదే నిదర్శనం.



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225

కుచేలుని దరిద్రానికి ఇది కూడా ఒక కారణమే. శ్రీకృష్ణుడు ఆ గాలివాన రోజు జరిగిన సంఘటనను గుర్తు చేయటంతో, అప్పటి తన మూర్ఖత్వం, స్వార్థబుద్ధి గుర్తుకు వచ్చింది. సిగ్గుతో కుంచించుకుపోతూ "భగవాన్! బాల్య చేష్టలలో దోషాలను చూడవద్దు. ఆనాటి చర్యకు నేను సిగ్గుతో చచ్చిపోతున్నాను అని మనస్సులోనే అనుకొని భగవానునికి నమస్కరించాడు. శ్రీకృష్ణుడు సర్వాంతర్యామి గనుక కుచేలుని మనస్సులోని భావాలను గ్రహించి నవ్వుకొని తిరిగి బాల్యంలోని ముచ్చట్లను ప్రారంభించాడు. గురుదేవుల యొక్క అభిమానం - వాత్సల్యం తమపై ఎంతగా ఉందో చెప్పుకొని ఆనందించారు. కుచేలా! నీకు గుర్తున్నదా? గురుదేవులు చివరగా మనతో ఏమన్నారో?

"గురువు కోసం, గురువుకు సేవ చేయటం కోసం అత్యంత ప్రియమైన దేహాన్ని భక్తితో సమర్పించి, గురుసేవ చేసిన ఉత్తమశిష్యులు మీరు. అట్టి మీ పట్ల నేను సంతృప్తి చెందాను. మీ మీ అభీష్టములు నెరవేరు గాక!" అని మనను ఆశీర్వదించాడు. శ్రీకృష్ణుని పలుకులు విని కుచేలుడు - దేవదేవా! భక్తుల కోర్కెలు దీర్చే నీవంటి దివ్యాత్మునితో కలసి గురుకులంలో విద్యాభ్యాసం గావించటం వల్ల నా జీవితం ఏ కొరతలు లేనిదే అయింది. అది జన్మజన్మల అదృష్టం అని పూర్వసంఘటనలను గుర్తుచేసుకుంటూ ఆనందభాష్పాలు రాలుస్తున్నాడు. శ్రీకృష్ణునంతటి మహానుభావుడు పేద బ్రాహ్మణునితో



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225

నవ్వుతూ మాట్లాడటం, ప్రేమతో చూడటం, ఆలింగనం చేసుకోవటం మొదలైన అపురూప దృశ్యాలనుచూచి అంతఃపుర స్త్రీలు ఆశ్చర్యపోతున్నారు. ఈ బ్రాహ్మణుడు నిరుపేద కాదు. ఇతడి భాగ్యమే భాగ్యం. ఇంతటి భాగ్యవంతుడు ముల్లోకాల్లో ఎక్కడైనా ఉంటాడా? అనుకుంటున్నారు భగవంతుడు భోగభాగ్యాలను చూడడు. గొప్ప మనస్సుందా? లేదా? అని మాత్రమే చూస్తాడు. నిర్మలమైన మనస్సు గల భక్తుడు కనుకనే కుచేలుడు ఇంతటి భాగ్యవంతుడయ్యాడు. భగవంతుని సన్నిధిలో కుచేలుడు సర్వమూ మరచిపోయాడు. ఇదే భక్తిలో పరాకాష్ట.

మరునాడు మిత్రులిద్దరూ అనేక విషయాలు మాట్లాడుకుంటున్నారు. కుచేలుడు తన కుటుంబ విషయాలన్నీ చెప్పాడు కాని తన దారిద్ర్యాన్ని గురించి ఒక్కమాట కూడా చెప్పలేదు. కుచేలా - రాకరాక వచ్చావు. నన్ను చూడాలని వచ్చావు గదా! మరి నాకు తినటానికి ఏమి తెచ్చావు? నా భక్తులు నాకు కొంచెం ఇచ్చినా అదే నాకు పదివేలు. భక్తుడు కానివాడు - దుష్టుడు - కొండంత బంగారాన్నిఇచ్చినా అది నేను స్వీకరించను.

శ్లో|| పత్రం పుష్పం ఫలం తోయం యోమేభక్త్యా ప్రయచ్ఛతి|
తదహం భక్త్య పహృతం అశ్నామి ప్రయతాత్మనః||

ఈ శ్లోకాన్ని శ్రీకృష్ణుడు కుచేలునికి చెప్పినది. దీనినే అక్షరం పొల్లు పోకుండా యుద్ధరంగ మధ్యంలో అర్జునునికి చెప్పటం జరిగింది.

**కం|| దళమైన పుష్పమైనను, ఫలమైనను, సలిలమైన**

**పాయని భక్తిం, గొలిచిన జనులర్పించిన,**

**నెలమిన్ రుచిరాన్నముగనె యేనుభుజింతున్ -**

**శ్రీకృష్ణుని మాటలు విని కుచేలుడు సిగ్గుతో తలవంచుకున్నాడు. ఆ మహానుభావుడికి ఈ అటుకులు ఎలా ఇవ్వటమా? అని సందేహిస్తున్నాడు.**

**కుచేలుడు ఎందుకు వచ్చిందీ శ్రీకృష్ణుడు దివ్యదృష్టితో తెలుసుకున్నాడు. కుచేలుడు తనను సంపదల కోసం ఎన్నడూ అర్థించడు. ఇప్పుడు కూడా భార్య మనస్సు నొప్పించలేకనే వచ్చాడు. ఇతడిని నేను సంతోషపెట్టాలి. దేవేంద్రునికి కూడా లభించని సంపదలను ఇవ్వాలి అనుకున్నాడు శ్రీకృష్ణుడు. అలా మనస్సులో అనుకొని, కుచేలా! పలుకవేమిటి? నాకోసం ఏమీ తేలేదా? మా వదిన నా కోసం ఏమీ పంపించలేదా? అన్నాడు. కుచేలుడు ఏమీ మాట్లాడలేకపోతున్నాడు. తాను తెచ్చిన అటుకులను ఇవ్వలేక పోతున్నాడు. "నిరుపేదనైన నేను నీకేమి ఇవ్వగలను" అన్నట్లు దీనంగా చూచాడు. ఇక శ్రీకృష్ణుడే ఉత్తరీయంలో మూటగట్టబడియున్న అటుకులను అందుకొని ఇదేమిటి? ఇది నాకోసమే గదా! కుచేలా! ఈ అటుకులంటే నాకు ఎంతో ఇష్టం" - అంటూ మిత్రుడికి అక్షయసంపద నివ్వగోరి పిడికెడు అటుకులు నోటిలో వేసుకున్నాడు. దానితో**

జగత్తంతా తృప్తి చెందింది. దాని ఫలితంగా కుచేలుని గృహం గొప్పసంపదలతో నిండిపోయింది.

శ్రీకృష్ణుడు రెండవ పిడికిలి తీసుకొని నోటిలో వేసుకోబోగా రుక్మిణీదేవి ఆయన చేతిని గట్టిగా పట్టుకుంది. ఒక్క పిడికిలి అటుకులతో అక్షయసంపదలను కుచేలునికి ప్రసాదించాడు శ్రీకృష్ణుడు. ఇప్పుడీ రెండవ పిడికిలి కూడా భుజిస్తే తనను కూడా కుచేలుని సేవకు పంపుతాడేమోనని సందేహం కలిగింది రుక్మిణికి - అందుకే తినవద్దని ఆపింది. ఆ రాత్రికి భోజనం చేసి పడుకున్నారు. మరునాడు ఉదయం కుచేలుడు ప్రయాణమయ్యాడు. శ్రీకృష్ణుడు కొంతదూరం వెళ్ళి వీడ్కోలు చెప్పి తిరిగివచ్చాడు.

కుచేలుడు శ్రీకృష్ణుని ఏమీ కోరలేదు. తన దారిద్ర్యాన్ని గురించి ఒక్కమాట కూడా చెప్పలేదు. శ్రీకృష్ణుడు కుచేలునికి - అక్షయసంపదలిచ్చినా అలా ఇచ్చినట్లుగ ఒక్కమాట కూడా చెప్పలేదు. ఇద్దరూ సంపదల గురించి - దారిద్ర్యాన్ని గురించి అసలు మాట్లాడుకోనే లేదు. కుచేలుడు ఎందుకు వచ్చిందీ శ్రీకృష్ణుడు అడగలేదు, కుచేలుడు చెప్పలేదు. ఇద్దరూ కలుసుకొన్నారు అంతే. భగవంతుని అనుగ్రహం ఉంటే చాలు కొబ్బరికాయలోకి నీరు వచ్చినట్లు సంపదలు వస్తాయి. ఆ అనుగ్రహం లేకపోతే ఏనుగు మింగిన వెలగపండులోని గుజ్జు మాయమైనట్లు సంపదలన్నీ అదృశ్యమైపోతాయి. కుచేలుడు



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225

సంపదలను కోరలేదు, భగవంతుని కోరుకొన్నాడు. భగవానుడు మాత్రం అతడికి రెండింటిని ప్రసాదించాడు.

కుచేలుడు తిరిగి తన గ్రామానికి వెళ్ళిపోతూ తనపై శ్రీకృష్ణుడు చూపించిన ప్రేమకు పరవశించిపోతున్నాడు. తాను ఎంతటి పేదరికంలో ఉన్నా ఎంతో పుణ్యం ఉండబట్టే కదా శ్రీకృష్ణ భగవానునితో అంత సన్నిహితంగా ఉండగలిగింది.

దరిద్రుడినైన నేనెక్కడ? సకల భోగభాగ్యాలతో - సంపదలతో తులతూగే శ్రీకృష్ణుడెక్కడ? రుక్మిణీదేవి శయనించే శయ్యపై నన్ను కూర్చోబెట్టాడు. రుక్మిణీమాత స్వయంగా నాప్రక్కన నిలబడి చామరంతో సేవ చేసింది. శ్రీకృష్ణుడు నన్ను భగవంతుని పూజించినట్లు పూజించాడు. ఆదిదంపతులే నన్ను పూజించారు. సంపద కోరియే తన భార్య తనను శ్రీకృష్ణుని వద్దకు పంపించింది. కాని శ్రీకృష్ణుడు నాకేమీ ఇవ్వలేదు. ఎందుకంటే సంపదల వల్ల అహంకారం పెరుగుతుంది. భగవంతునికి దూరమై పోతాను. అందుకే సంపదలనివ్వలేదు. నిజంగా మనం కోరవలసింది సంపదలను కాదు - పరమాత్మను. ఇలా భావించుకుంటూ శ్రీకృష్ణుని తన మనస్సులో స్మరించుకుంటూ నడక సాగించాడు కుచేలుడు.

కుచేలుడు స్వగ్రామం చేరాడు. తన ఇంటి వద్దకు చేరాడు. ఆశ్చర్యం. అక్కడ తన ఇల్లు లేదు. అక్కడొక అందమైన గొప్పభవనం ఉంది. ఉద్యానవనాలు, సరోవరాలు; విలువైన ఆభరణాలు ధరించిన

అనేకమంది పరిచారికలు అక్కడ తిరుగుతూ ఉండటాన్ని చూచాడు. దారి తప్పి వచ్చినట్లు భ్రమపడ్డాడు. అక్కడ నుండి తిరిగి వెళదామనుకుంటూ ఉండగా దేవతలలాగా కనిపించే స్త్రీ పురుషులు అనేక దివ్య వస్త్రాభరణాలు ధరించి, ఎదురొచ్చి వాయిద్యాలతో - మేళతాళాలతో స్వాగతం పలుకుతున్నారు.

భర్త రాకను తెలుసుకున్న కుచేలుని భార్య లక్ష్మీదేవి లాగా వెలుగొందుతూ భవనంలోపల నుండి వచ్చింది. ఆమెను చూచి కుచేలుడు ఆశ్చర్యపోతున్నాడు. ఆమె భర్తను చేయిపట్టుకొని లోనికి తీసుకుపోయింది. నూరుస్తంభాలతో దేవేంద్రభవనాన్ని తలదన్నే విధంగా ఉన్నదాభవనం. అనేకమైన చిత్ర విచిత్రమైన అమూల్యమైన వస్తువులున్నాయి. వాటినిచూచి ఇదంతా శ్రీకృష్ణుని కృపా విశేషమహిమయే అని భావించాడు.

"ఆహా! నా స్నేహితుడు, నా దైవం, నాప్రాణనాథుడు ఐన శ్రీకృష్ణుడు ప్రత్యక్షంగా నాకు ధనం ఇవ్వకుండా అక్షయసంపదలను సమకూర్చాడు. నా నుండి పిడికెడు అటుకులను తీసుకొని నాకు స్వర్గభోగాలనందించాడు. భగవంతునికి భక్తితో ఏ కొంచెం సమర్పించినా అది అనంత ఫలితాన్నిస్తుంది. జన్మజన్మలకు ఆ దివ్యాత్ముని సేవించే భాగ్యం, ఆయనను అర్చించే వారిని సేవించే భాగ్యం లభిస్తే చాలు. నేను సదా ఆయన ధ్యానాన్నే కోరుకుంటా.



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225

హే కృష్ణా! నాకు ఈ భోగాలయందు ఆసక్తి కలుగకుండా ఇంతకుముందు లాగానే అనన్య భక్తితో నిన్ను సేవించే భాగ్యాన్నే నాకు ప్రసాదించు అని కుచేలుడు శ్రీకృష్ణుని ప్రార్థించాడు. కుచేలుని భార్య కూడా అలాగే శ్రీకృష్ణుని ప్రార్థించింది.

## ఫలశ్రుతి:

శ్రీకృష్ణుడు కుచేలుని అనుగ్రహించి చరితార్థుని చేసిన చరిత్రను విన్నా, చదివినా, వినిపించినా అట్టి సత్పురుషులకు ఇహపర సుఖములు, హరిభక్తియు, చిరకీర్తియు కలుగునని పరిక్షీన్మహారాజుకు శుకబ్రహ్మ ఫలశ్రుతిని తెలియజేశాడు.

## విశ్లేషణ

శ్రీకృష్ణుడు కుచేలుడు చిన్ననాటి స్నేహితులు - సహాధ్యాయులు. ఇది భాగవతంలోని కథ. ద్రుపదుడు ద్రోణాచార్యుడు చిన్ననాటి స్నేహితులు - సహాధ్యాయులు. ఇది మహాభారతంలోని కథ. ఈ రెండు కథల మధ్య - ఈ రెండు స్నేహితులజంటల మధ్యగల వ్యత్యాసం ఏమిటో చూడండి. దృపదుడు మహారాజ కుమారుడు. ద్రోణాచార్యుడు భారద్వాజుడనే మహర్షి పుత్రుడు. ఇద్దరూ మొదట భరద్వాజుని వద్ద - ఆ తర్వాత అగ్నివేశుడను ముని వద్ద ధనుర్విద్యాభ్యాసం గావించారు. ఆ రోజుల్లో దృపదుడు ద్రోణునితో అనేవాడు. మిత్రమా! మన విద్యాభ్యాసం పూర్తయి తిరిగి వెళ్ళిన తర్వాత నేను పాంచాల రాజ్యానికి ప్రభువునౌతాను. అప్పుడిక నీకు పేదరికమనేదే ఉండదు. నీకు



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225

కావలసిన సకల సంపదలు నేను సమకూరుస్తాను అని అంటూ ఉండేవాడు. ద్రుపదుడు రాజైన తర్వాత ద్రోణుడు తన బిడ్డ అశ్వద్ధామకు పాలు కూడా ఇవ్వలేని స్థితిలో తన బిడ్డ పాలకోసం ఒక గోవును అర్థించటానికి ద్రుపదుని వద్దకు వెళ్ళాడు. ఏం జరిగింది? ద్రోణునికి ఘోర అవమానం. దాని కారణంగా ద్రుపదుడు బంధించబడి ద్రోణుని పాదాలపై పడటం - పాంచాలరాజ్యం రెండు ముక్కలు కావటం. ద్రోణుని వధించే కుమారునికై ద్రుపదుడు యాగం చేయటం, ద్రోణవధ - చివరకు పాంచాలురు ఒక్కరు కూడా మిగలకుండా సర్వసంహారం. మరి శ్రీకృష్ణుడు కుచేలుడు చిన్ననాటి స్నేహితులు. సాందీపనిమహర్షి శిష్యులు. సహాధ్యాయులు. శ్రీకృష్ణుడు కుచేలునికేమీ మాట ఇవ్వలేదు. భార్య ప్రోద్బలంతో కుచేలుడు శ్రీకృష్ణదర్శనానికి వచ్చాడు. అపూర్వ స్వాగత సత్కారాలు - పాదపూజలు - రుక్మిణీదేవి చేత సపర్యలు - అఖండ ఐశ్వర్య ప్రదానం. భగవంతునికి - భక్తునికి మధ్య అపూర్వకలయిక - సృష్టి ఉన్నంతవరకు మరువలేని - మరుపురాని సంఘటన. చిన్ననాటి స్నేహితులు ఎలా ఉండాలో తెలియజెప్పిన అద్భుత సంఘటన -

శ్రీకృష్ణుడు చిన్ననాటి సహాధ్యాయి - పరమభక్తాగ్రేసరుడు - స్నేహితుడు - పేదబ్రాహ్మణుడు ఐన కుచేలుని ఎలా అనుగ్రహించాడో తెలియజేసిన శుకమహర్షి ఇప్పుడు పరమవిరహాసక్తులు -



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225

భక్తాగ్రగణ్యులు అయిన గోపికలను ఎలా అనుగ్రహించాడో తెలియజేయబోతున్నాడు.

**Website : WWW.SRICHALAPATHIRAO.COM**

**Email : care@srichalapathirao.com**

**Contact : +91 80085 39770 / +91 98862 65225**

## Audio CD, Video DVD, Book రూపములలో అందుబాటులో గలవు

I. మహాభారతం : ఆదిపర్వం, సభాపర్వం, వనపర్వం, విరాటపర్వం....; జీవనసత్యాలు, ధర్మాధర్మ విశ్లేషణ; ద్రౌపది, కర్ణుడు, ప్రశ్నలు - సమాధానములు;

II. ఆధ్యాత్మిక గ్రంథములు : కర్మసిద్ధాంతం, జీవుల సుడిగుండాలు, ప్రశాంత జీవనానికి 18 సూత్రములు, మరణాన్ని మంగళప్రదంచేసుకో, ఆధ్యాత్మిక జీవనం, శ్రీ శంకరాద్వైత వ్యాసమాల, ప్రశ్నలు - సమాధానములు;

III. ప్రకరణ గ్రంథములు : తత్త్వబోధ, భజగోవిందం, శ్రీ దక్షిణామూర్తిస్తోత్రం, ఆత్మవిద్యావిలాసం, ఉపదేశసారం, ఆత్మబోధ, అద్వైతసారం, సాధనపంచకం, వివేక చూడామణి

IV. శ్రీమద్భగవద్గీత : 1-18 అధ్యాయములు

V. ఉపనిషత్తులు :- ఈశావాస్య, కేన, కఠ, ముండక, మాండూక్య, కైవల్య, గర్భ, సూర్య, దర్శన, తారసార, మహావాక్య, పంచబ్రహ్మ, గోపాలతాపిన్య, వరాహ, శాట్యాయనీ, హయగ్రీవ, దత్తాత్రేయ, గారుడ, కలిసంతరణ, ముక్తిక

VI.భక్తి: శ్రీమద్భాగవతం,శ్రీనారదభక్తిసూత్రములు,శ్రీకృష్ణఅష్టోత్తరశతనామావళి

VII. బ్రహ్మసూత్రములు : శ్రీ బాదరాయణ విరచిత బ్రహ్మసూత్రములు

VIII. గురువు : గురువు యొక్క అవసరము, ఆషాఢ / గురు / వ్యాస పూర్ణిమ ప్రాధాన్యత, గురువును ఎలా గుర్తించి సేవించాలి, ఎందుకు ?, గురువు పట్ల శిష్యుని కర్తవ్యం, గురూపదేశం, గురువు యొక్క ఆవశ్యకత, గురువు యొక్క అనుగ్రహం ఎందుకు ? ఎలా పొందాలి ?, గురు పాదతీర్థం

IX. సాధనలు : పరమార్థ సాధనలు, సమాధి అభ్యాసం



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225

**X. ఇతర గ్రంథములు : మహాత్ముల సూక్తులు, ఉత్తమ జీవనవిధానం, పరమార్థ సాధనలు , మోక్ష సాధనా రహస్యం , ధ్యానం - ప్రయోజనములు, సోऽహం భావన ద్వారా ముక్తి**

**XI. మరెన్నో ఇతర గ్రంథములు**



Email : care@srichalapathirao.com Contact : +91 8008539770 / +91 9886265225